పాహిమాం.. పార్వతీపుత్రా..

● సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె/ఆత్మకూరు, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస ఆదివారాన్ని పురస్కరించుకుని సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపాన కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వేకువజామున వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆత్మకూరు మండలం పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. బంగారు ఆభరణాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులు భారీగా తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.


అలంకరణలో గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

టమోటాలు కిలో రూ.40

అనంతపురంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.24, సరసరాగా రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,600 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డెక్కిన భవనాలు..!

పార్కింగ్ లేని భవనాలు కనిపించవా?

నగరంలో ప్రధానంగా ఫంక్షన్‌హాళ్లు, భారీ భవంతులు పార్కింగ్ లేకుండా నిర్మిస్తున్నారు. అశోక్‌నగర్, హౌసింగ్‌బోర్డు ప్రాంతాల్లోని కొన్ని ఫంక్షన్‌హాళ్ల ముందు ద్విచక్రవాహనం నిలిపేందుకు కూడా స్థలం వదల్లేదు. రోడ్డుమీద వరకు కట్టేశారు. ఇలాంటి నిర్మాణాలు నగరంలో కోకొల్లలు ఉన్నాయి. వీటితో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.




పార్కింగ్‌కు స్థలం వదలకుండా అశోక్ నగర్‌లో నిర్మించిన ఫంక్షన్ హాల్

పార్కింగ్‌కు స్థలం వదలకుండానే నిర్మాణాలు

- ఫంక్షన్ హాళ్ల ముందు కూడా జాగా కరువు
- క్రమబద్ధీకరణ పట్టని అధికారులు
- ముడుపులతో కళ్లు మూసుకుంటున్న వైనం
- వసూళ్లలో సచివాలయాల అడ్మిన్లదే కీలకపాత్ర
- నగరపాలక సంస్థ ఆదాయానికి భారీ గండి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభాకి అనుగుణంగా నగరంలో రోడ్లు విశాలంగా లేక ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రమయ్యాయి. కుంచించుకుపోయిన రోడ్లు, వాటిపైనే వాహనాలు ఆపుతుండడంతో నగరంలో ప్రయాణమంటేనే నరకంగా మారుతోంది. పెద్దపెద్ద భవంతులను సైతం రోడ్డుకి ఏమాత్రం స్థలం వదలకుండా కట్టేస్తున్నారు. ఫంక్షన్ హాల్‌లో ఏ కార్యం జరిగినా పెద్ద సంఖ్యలో జనం కలుస్తుంటారు.

అలాంటి ఫంక్షన్ హాళ్ల ముందు కూడా కనీసం పార్కింగ్‌కు అడుగు స్థలం వదలట్లేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా నగర పాలక సంస్థ అధికారులు ఎందుకు కళ్లు మూసుకున్నారోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని ప్రస్తుతం క్రమబద్ధీకరించి, నగర పాలక సంస్థకు ఆదాయం తెచ్చే ఆలోచన కూడా చేయట్లేదు. ముడుపులు అందుకుని కళ్లు మూసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వసూళ్లలో కొందరు సచివాలయ అడ్మిన్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్లక్ష్యం ఎందుకో..?

నగర పాలక సంస్థ పరిధిలో ఏ చిన్న నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలన్నా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలతో పాటు వార్డు సచివాలయాల అడ్మిన్‌లది కీలకపాత్ర. అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలోనే క్షేత్రస్థాయిలో ఆ స్థలాన్ని పరిశీలించి, నిబంధల ప్రకారం ఉంటేనే అనుమతులు ఇవ్వాలి. నగర పాలక సంస్థలో ఇందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఫంక్షన్‌హాళ్లు సైతం వాహనాల పార్కింగ్‌కు కూడా స్థలం వదలకుండా కట్టేస్తున్నారు. వీటిని అడ్డుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి.


ఆర్టీఓ ఆఫీస్ రోడ్డులో పార్కింగ్ లేకుండా నిర్మించిన కన్వెన్షన్ హాల్


హౌసింగ్ బోర్డుకు వెళ్లే దారిలో ఓ ఫంక్షన్ హాల్

సచివాలయ అడ్మిన్ల కీలక పాత్ర

నగరంలో అనుమతిలేని, పార్కింగ్‌లేని నిర్మాణాల గురించి అధికారుల దృష్టికి తీసుకొచ్చి, వాటిపై పన్నులు విధించడం, క్రమబద్ధీకరించడంలో వార్డు సచివాలయ అడ్మిన్‌లది కీలకపాత్ర. అక్రమ నిర్మాణాల నుంచి నగర పాలక సంస్థకు వచ్చే ఆదాయానికి గండికొడుతూ.. ఆయా ప్లానింగ్, రెవెన్యూ విభాగాల జేబులు నింపుతూ... తాము ఇంత వెనకేసుకుంటున్నారని సచివాలయ అడ్మిన్లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాతూరు, విద్యుత్‌నగర్, న్యూటౌన్, రామ్‌నగర్ పరిధిలో రెండేసి సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరీలు ముడుపుల వసూళ్లలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

సీడీఎంఏ ఆదేశాలు బేఖాతర్

గతంలో పార్కింగ్‌కు స్థలం వదలకుండా, వీఎల్‌టీ కట్టకుండా నిర్మించిన భవనాలపై పురపాలక శాఖ ప్రధాన సంచాలకుడు (సీడీఎంఏ) ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనుమతి లేకుండా నిర్మించిన ఫంక్షన్ హాళ్లు, భారీ ఇళ్లపై సీడీఎంఏకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఓ సచివాలయ అడ్మిన్‌పై చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులకు సీడీఎంఏ నంచి ఆదేశాలు అందాయి. వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుండడం సందేహాలకు తావిస్తోంది. గతంలో చాలా ఫిర్యాదులు వచ్చినా పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

నిబంధనల ప్రకారం పన్నులు విధించాలి



అనుమతి లేకుండా నిర్మిస్తే క్రమబద్ధీకరించాలి, పన్నులైనా విధించాలి. పార్కింగ్ లేకుండా ఫంక్షన్ హాళ్లు, ఇళ్లు నిర్మించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వరాదు. దీనిపై సీడీఎంఏ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. నగర పాలక సంస్థ ఆదాయానికి నష్టం వచ్చేటట్లు చేస్తే కచ్చితంగా అటువంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోం.

- బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్

20 ఏళ్ల జైలు అంటే

హత్యలు చేస్తావా..?

- చరిత్రను వక్రీకరించి రెచ్చగొట్టొద్దు
- తోపుదుర్తి వ్యాఖ్యలపై పరిటాల సునీత ఫైర్


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్ల పాటు జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర స్థాయి లో ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానంటూ బహిరంగంగా మాట్లాడుతున్నాడంటే.. హత్యలు చేసేందుకు ప్రకాష్ రెడ్డి సిద్ధమైనట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... ఇరవై ఏళ్ల జైల్లో ఉండాలంటే హత్యలు చేసే వెళ్లాలి.. అలాంటి ఆలోచనలు ఏవైనా ఉంటే మానుకొని, జాగ్రత్తగా ఉండాలని ఆమె ప్రకాష్‌రెడ్డిని హెచ్చరించారు. 'మేము నీలాగా ఆలోచిస్తే ఇంత స్వేచ్ఛగా మాట్లాడగలుగుతావా' అని తోపుదుర్తిని ప్రశ్నించారు. గతంలో జరిగిన చరిత్రను వక్రీకరిస్తూ... వారి పార్టీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. పరిటాల రవీంద్ర తన ప్రాంతానికి ఏం చేశారు..? ప్రజలకు ఎలాంటి పరిస్థితుల్లో అండగా నిలిచారన్నది ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 'నీవు ఏం చేశావో.. ఆ పాపాలు పండాయ్.. అందుకే జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండు' అని ఆమె ప్రకాష్‌రెడ్డికి సూచించారు. తమ ప్రభుత్వం చట్టం ప్రకారం పనిచేస్తోందని, అందుకే అతడి జైలుబాటకు కొంత సమయం పడుతోందన్నారు. తాము అతడిలా అధికారాన్ని అడ్డం పెట్టుకొని, దౌర్జన్యాలు, దోపిడీలు చేయలేదన్నారు. తనను చూసి ప్రజలు, తమ పార్టీ నాయకులెవరూ భయపడటం లేదన్నారు. తప్పులు చేసిన వారికి, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడే వారికి తన కుమారుడు సింహస్వప్నమే అన్నారు. తాము ఎవరినైనా బెదిరించి ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. ఐదేళ్లల్లో పేరూరు ప్రాజెక్టు విషయంలో అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. రాక్రీట్ సంస్థ ద్వారా పేదలు, ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా హత్యారాజకీయాలు, రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలన్నారు. విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడే జగన్‌రెడ్డి.. ఒక మహిళా ఎమ్మెల్యేను సభ్య సమాజం తలదించుకునేలా ఒక వ్యక్తి మాట్లాడితే.. అతడిని పరామర్శించేందుకు వెళ్లడమేనా విలువలు, విశ్వసనీయత అంటే అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లడంపై సమాధానం చెప్పాలని నిలదీశారు. ఆస్తి కోసం తల్లి, చెల్లి మీద వేసిన కేసులో విజయం సాధించిన వీరుడిలా కనీసం మానవత్వం లేకుండా ప్రచారం చేసుకుంటున్న జగన్‌కు విలువలు, విశ్వసనీయత ఉందా అని ఆమె ప్రశ్నించారు.

గ్రామీణ విద్యార్థులకు

చేయూత

నెలకు రూ. 600 చొప్పున రవాణా భత్యం

పిల్లల గుర్తింపులో సమగ్రశిక్ష అధికారుల నిర్లక్ష్యం


ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు

అనంతపురం విద్య, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులలో దాదాపు నిరుపేద పిల్లలే చదువుతుంటారు. విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది తగ్గిపోతుండడంతో.. అదేస్థాయిలో రేషనలైజేషన్‌లో గ్రామాల్లో పాఠశాలలు మాయమైపోతున్నాయి. దీంతో కొన్ని ప్రాంతాలలో విద్యార్థులు కిలోమీటర్, రెండు, మూడు కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లలు రోజూ ఆటోలు, బస్సుల్లో వెళ్లి చదువుకోవడానికి తల్లిదండ్రులకు ఆర్థిక సమస్యలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గ్రామీణ పిల్లలు చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణాభత్యం పేరుతో ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది.

నెలకు రూ.. 600 సాయం

ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్న విద్యార్థులకు మాత్రమే (మిగతా 7లో...)

కూలి బతుకులో కన్నీళ్లు..!

అబార్షన్ చేస్తుండగా గర్భిణి మృతి

ఆస్పత్రిలో నిబంధనల ఉల్లంఘన

అవగాహన కల్పిస్తున్నా.. ఆగని అబార్షన్లు..

అనంతపురం వైద్యం, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): కూలి చేసుకుంటేనే కుటుంబం గడుస్తుంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. మళ్లీ ఆ ఇల్లాలు గర్భం దాల్చింది. ఇక చాలనుకున్నారు. అబార్షన్ చేయించుకుందామని ఆస్పత్రికెళ్తే.. ప్రాణాలే పోయాయి. అనంతపురం నగరంలోని రామచంద్రనగర్‌లో గల శ్రీకృప ఆస్పత్రిలో ఆదివారం అబార్షన్ చేస్తుండగా ఐదు నెలల గర్భిణి రాధిక (34) మరణించింది. అబార్షన్లు వద్దని అవగాహన కల్పిస్తున్నా.. ఆగట్లేదనడానికి రాధిక మృతే నిదర్శనం. ప్రైవేటు ఆస్పత్రుల్లో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నది బహిరంగా ఆరోపణే. ఎంత కఠిన చట్టాలున్నా.. అబార్షన్లు గుట్టుగా చేసేస్తున్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయడంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, ఆస్పత్రుల ధనదాహం రాధికను బలిగొన్నాయి.




కన్నీళ్లు పెట్టుకుంటున్న రాధిక భర్త మల్లికార్జున, విలపిస్తున్న కుటుంబ సభ్యులు

లోపం ఎక్కడ?

బుక్కరాయసముద్రం మండలం చెదళ్ల గ్రామానికి చెందిన రాధిక, ఆమె భర్త మల్లికార్జున కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఐదు సంవత్సరాల అమల, మూడు సంవత్సరాల మోహన్ సాయి ఉన్నారు. రాధిక మూడోసారి గర్భం దాల్చింది. విషయాన్ని గ్రామంలోని ఆశా వర్కర్, ఏఎన్ఎం ఆరోగ్య రికార్డుల్లో నమోదుచేసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోనూ పేరు రాయించారు. అయినా ఎందుకు అబార్షన్ చేయించాలని అనుకున్నారో అర్థంకాని పరిస్థితి. గర్భిణి ఆరోగ్య పరిస్థితిని నిత్యం పర్యవేక్షించాల్సిన సంబంధిత సిబ్బందే అబార్షన్‌కు తీసుకురావడం శోచనీయం.

పాపం.. పసివాళ్లు..



రాధిక కుమారుడు, కుమార్తె

రాధిక మృతిచెందిన విషయం తెలియని ఆమె ఇద్దరు పిల్లలు ఆడుకుంటూ కనిపించారు. రాధిక మృతదేహం వార్డులోనే ఉంది. న్యాయం చేయాలని తండ్రి మల్లికార్జునతోపాటు బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. ఇవేవీ తెలియని రాధిక కుమార్తె అమల, కుమారుడు మోహన్‌సాయి అక్కడే ఆడుకుంటూ అమాయకంగా చూస్తుండడం అందరినీ కలచివేసింది. అమ్మ మృతిచెందిందనీ, ఇక లేదని ఆ పసివాళ్లకు తెలియదు పాపం..

తగిన చర్యలు తీసుకుంటాం...

రాధిక మృతిపై జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనుపమ మీడియాతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శ్రీ కృప హాస్పిటల్‌ను గతంలోనే సీజ్ చేశామన్నారు. రోగులను అడ్మిట్ చేసుకుని, వైద్యసేవలు అందిస్తున్నట్లు రాధిక మృతితో తెలిసిందన్నారు. అబార్షన్ చేయాలని వచ్చిన వారిని అడ్మిట్ చేసుకోవడం నేరమన్నారు. అదే సమయంలో అనుమతి లేకుండా అబార్షన్ చేయించుకోవడం చట్ట విరుద్ధమన్నారు. రాధిక మృతి, అబార్షన్‌పై విచారణచేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


రాధిక మృతదేహం

ఆస్పత్రి సీజ్..

రాధిక మృతితో శ్రీకృప ఆస్పత్రిని వైద్యాధికారులు సీజ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనుపమ, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్, త్రీటౌన్ సీఐ శాంతిలాల్, ఎస్ఐ శరత్‌చంద్ర.. రాధిక మృతిపై వివరాలు సేకరించారు. అనంతరం ఆస్పత్రిని, ఆపరేషన్ థియేటర్‌ను పంచనామా చేసి సీజ్ చేశారు.


ఆస్పత్రిని సీజ్ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ అధికారులు


శ్వేత (ఫైల్)


మౌనిక (ఫైల్)

అయ్యో పాపం

● నీటి దొనలో పడి ఇద్దరు చిన్నారుల మృతి ● అమ్మ మందలిస్తుందేమోనని స్నేహితురాలితో కలిసి అఘాయిత్యం (7లో...)

హత్యల కలకలం

వేర్వేరు చోట్ల ఇద్దరి హత్య

(వివరాలు 7లో..)



పంచాయతీరాజ్ శాఖలో సందడి

● పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ● రికార్డులు సిద్ధం చేస్తున్న సిబ్బంది ● పదేళ్లు కావడంతో సాంకేతిక సమస్యలు ● సెలవు రోజు సైతం పనిలో నిమగ్నం

(7లో....)


ఎమ్ బుక్స్ పరిశీలిస్తున్న సబ్ డివిజన్-2 డీఈ కృష్ణజ్యోతి

జీపు బోల్తా : ఇంజనీర్ మృతి


బోల్తా పడిన జీపు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం-అనంతపురం జాతీయ రహదారిలోని వేపరాలక్రాస్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జీపు బోల్తా పడి కేబుల్ నెట్‌వర్క్ ఇంజనీర్ బసవరాజు(28) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గం మండలం మానేపల్లికి చెందిన బసవరాజు వొడాఫోన్ కేబుల్ నెట్‌వర్క్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. గుండ్లపల్లి నుంచి ఆవులదట్లకు భోజనానికి వెళ్లొస్తానని జీపులో వస్తుండగా కల్వర్టు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ కమల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. బసవరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు జాతీయ రహదారిపై గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


రాజేష్(ఫైల్)

అమడగూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహమ్మదాబాద్ పాత సచివాలయం వద్ద ఆదివారం రాజేష్ (36) అనే యువకుడు చీరతో చెట్టుకు ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరం తారకరామాపురం కాలనీకి చెందిన రంగదామప్ప కుమారుడు అమడగూరు మండలంలో బావుచెరువుపల్లికి చెందిన శాంతమ్మ, కేశవయ్యల కుమార్తె శ్రావణిని ఏడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇతడు ధర్మవరంలో మగ్గం నేసుకుని జీవనం సాగించేవాడు. రెండు సంవత్సరాల నుంచి దంపతుల మధ్య గొడవలు మొదలై విడిపోయి ఒంటరి జీవనం సాగిస్తున్నారు. మృతుడి భార్య, తల్లిదండ్రులతో కలిసి బెంగుళూరులో ఉంటున్నారు. శనివారం రాజేష్ ధర్మవరం నుంచి మహమ్మదాబాద్‌కు వచ్చినట్లు స్థానికులు పోలీసులకు తెలిపారు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఒత్తిళ్లు తట్టుకోలేక మరో యువకుడు..


హర్ష (ఫైల్)

నార్పల(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీలో హర్ష(25) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే.. కాలనీకి చెందిన ఆదెప్ప కుమారుడు హర్ష అనంతపురంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. హర్ష కంపెనీ ఉద్యోగ రీత్యా ఒత్తిళ్లు తట్టుకోలేక మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మృతిని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి తండ్రి ఆదెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

అయ్యో.. పాపం..!

నీటి దొనలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

అమ్మ మందలిస్తుందేమోనని స్నేహితురాలితో కలిసి అఘాయిత్యం


చిన్నారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాలు మాడిపోవడంతో తల్లి ఎక్కడ మందలిస్తుందోనని రాయదుర్గం మండలం టీ వీరాపురం గ్రామానికి చెందిన శ్వేత (13), స్నేహితురాలు మౌనిక (9)తో కలిసి నీటి దొనలో పడి ఆదివారం మరణించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఈశ్వరప్ప, భవాని దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. చిన్న కుమార్తె శ్వేత 9వ తరగతి చదువుతుండేది. ఇంట్లో పాలు కాచిపెట్టమని శ్వేతకు తల్లి భవాని చెప్పి, పొలం పనులకు వెళ్లింది. శ్వేత పాలు కాచేందుకు పెట్టి మరచిపోయింది. అవి కాస్తా మాడిపోవడంతో స్టౌ ఆఫ్ చేసింది. అమ్మ ఎక్కడ మందలిస్తుందోనని భయపడిపోయింది. అదే ఊరికి చెందిన మిత్రురాలు, గంగాధర, మమత దంపతుల కుమార్తె మౌనికతో కలిసి గ్రామ సమీపంలోని గంగమ్మ దొన వద్దకెళ్లింది. ఇద్దరూ దొనలో పడి చనిపోయారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికొచ్చి కుమార్తె కోసం గ్రామంలో వెతకసాగారు. గొర్రెల కాపరులను అడగ్గా.. గ్రామ సమీపంలోని దొన వద్దకు వెళ్లారని చెప్పారు. దొనలో గాలించగా.. ఇద్దరి శవాలు బయటపడ్డాయి. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

20 మందిపై కేసు

గుత్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావా దేవీల వ్యవహారంలో దస్తగిరి అనే వ్యక్తిపై దాడికి పాల్పడిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ శివారులోని జెడ్ వీరారెడ్డి కాలనీలో నివాసం ఉన్న దూదేకుల దస్తగిరి ఇంటిపై దాడికి పాల్పడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన ఉప్పర సుబ్బయ్య అనే వ్యక్తి వద్ద గుత్తి పట్టణానికి చెందిన దస్తగిరి రూ.37.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం సుబ్బయ్యకు తన ఇంటితో పాటు ఖాళీ స్థలాన్ని రిజిష్టర్ చేయించాడు. మూడు సంవత్సరాలలోపు అప్పు తీర్చని పక్షంలో తన ఆస్తిని స్వాధీన పరుచుకోవాలని అగ్రిమెంటు రాయించుకున్నారు. ఈ విషయమై గత నాలుగు నెలలుగా ఇల్లు తమకు స్వాధీన పరచాలని పలుమార్లు చెప్పారు. పట్టించుకోకపోవటంతో దస్తగిరిపై దాడికి పాల్పడ్డారని సీఐ తెలిపారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు తొండపాడుకు చెందిన ఓంప్రకాష్, శ్రీపురానికి చెందిన శివ, జక్కలచెరువుకు చెందిన సూర్యప్రతాప్, కొంగనపల్లి గోవర్ధన్, గోవిందు, గౌరీ శంకర్‌తో పాటు మరో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్ రీవైండింగ్‌లో హౌస్‌వైరింగ్, మోటార్ రీవైండింగ్‌లో స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీసెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అధిక నాణ్యతగల సాంకేతికత, సౌకర్యాలతో హౌసింగ్ వైరింగ్, ఎలక్ట్రికల్ నిర్వహణ, ఎలక్ట్రికల్ పరికరాల రిపేరీలు, ఫ్యాన్ల రిపేరీ, మోటార్ రీవైండింగ్‌లలో నాణ్యమైన శిక్షణ 45 రోజుల పాటు ఇస్తామని తెలిపారు. 18-40 సంవత్సరాల వయస్సులోపు ఉన్న నిరుద్యోగ యువత ఐదో తరగతి, పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదివి ఉన్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9704407134, 7780752418లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో సందడి

- పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- రికార్డులు సిద్ధం చేస్తున్న సిబ్బంది
- పదేళ్లు కావడంతో సాంకేతిక సమస్యలు
- సెలవురోజు సైతం పనిలో నిమగ్నం


ఈఈ విభాగంలో రికార్డులను పరిశీలిస్తున్న సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయంలో ఆదివారం కూడా సందడిగా కనిపించింది. సెలవు రోజు సైతం సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు. పది సంవత్సరాల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 21 శాతం బిల్లుల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సిబ్బంది శనివారం నుంచే బిల్లుల అప్‌లోడ్‌లో నిమగ్నమయ్యారు. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులకు సంబంధించిన ఫైల్స్ అప్‌లోడ్ పూర్తయ్యేలా చూడాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. దీంతో సిబ్బంది మొత్తం ఆదివారం సెలవు రోజు అయినప్పటికి కార్యాలయంలో వర్కింగ్ రోజు మాదిరిగానే కనిపించింది. 2014-15లో చేపట్టిన పనులకు సంబంధించి అప్పట్లో చేపట్టిన పనులకు 21 శాతం బిల్లులు పెండింగ్ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌కు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఈ ఏడాది జనవరిలో దాదాపు రూ. 3 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఏప్రిల్‌లో మొత్తం బిల్లులు మంజూరయ్యాయి. రెండో విడత బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.9 కోట్ల బిల్లుల చెల్లింపులకు ప్రక్రియ పూర్తి చేయాలని ఈఎన్‌సీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం సెలవురోజు అయినప్పటికి సిబ్బంది అందరిని అందుబాటులో ఉంచుకొని బిల్లుల అప్‌లోడ్ చేయడంలో నిమగ్నమయ్యారు. పదేళ్ల క్రితం పనులు కావడంతో ఎం.బుక్స్ దొరక్క కొందరు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాటు కొన్నింటికి సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. కొన్ని పనులకు సంబంధించి అప్‌లోడ్ చేసే సమయంలో రివైజ్ ఎస్టిమేట్స్ అప్‌లోడ్ చేయాలని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఇలాంటి వాటికి సంబంధించి బిల్లుల చెల్లింపులకు కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొంది వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు కోరుతున్నారు. మొదటి విడతలో రికార్డులు అప్‌లోడ్ చేసిన మూడు నెలల్లో ఖాతాల్లోకి సొమ్ము చేరింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు



2014-15 సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి అప్పట్లో 21 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం దశల వారిగా వాటిని క్లియర్ చేయడానికి చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఈ ఏడాది మొదటిలో అనుమతి ఇవ్వడంతో అప్పట్లో అప్‌లోడ్ చేసిన వాటికి సంబంధించి దాదాపు రూ.3 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. అదే విధంగా ఇంకా పెండింగ్ ఉన్నవాటిని కూడా క్లియర్ చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. దీంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా నివేదికలు తయారు చేస్తున్నాం. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

-ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ

గ్రామీణ విద్యార్థులకు చేయూత

(5వ పేజీ తరువాయి)

రవాణాభత్యం కింద ఆర్థిక సాయం అందిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాథమికోన్నతపాఠశాల, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలకు రోజూ రాకపోకలు చేస్తూ చదువుకుంటున్న విద్యార్థులకు రవాణాభత్యం వర్తిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 600 ఇస్తారు. ఇలా పదినెలలు పాటు ఏడాదికి రూ.6వేలు ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం ప్రభుత్వం అందించనుంది. ఈ మేరకు రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్ఎస్ఏ అధికారులు జిల్లాలో రవాణాభత్యం అమలుకు చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఇటు విద్యార్థులు, తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బడుగుల పిల్లలకు వరం



రవాణా భత్యం అందించడం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు వరం. కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేద విద్యార్థుల చదువుల పట్ల ఇంత ప్రేమ చూపడం ఆనందదాయకం. నిబంధనల మేరకు అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి రవాణా భత్యం అందేలా అధికారులు చూడాలి.

- బండారు శంకర్, జాతీయ ఉపాధ్యక్షుడు, ఎంఈఎఫ్

డ్రాపౌట్స్ తగ్గుతారు



చాలామంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి బడులకు వస్తున్నారు. రోజూ డబ్బులు పెట్టి బడికి రావాలంటే తల్లిదండ్రులకు భారమవుతోంది. డబ్బులు ఇవ్వకపోతే పిల్లలు బడికి రావడానికి ఇష్టపడరు. దీంతో డ్రాపౌట్స్ ఎక్కువయ్యే అవకాశం ఉండేది. ఇపుడు రవాణాభత్యం ప్రభుత్వమే చెల్లిస్తుంది. దీంతో తల్లిదండ్రులకు డబ్బు సమస్య ఉండదు. పిల్లలు రోజూ బడికి వస్తారు, డ్రాపౌట్స్ తగ్గే అవకాశం ఉంటుంది.

- రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

అర్హులను గుర్తిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు రవాణా భత్యం ఎంతో ఉపయుక్తం. ఇందుకోసం నిబంధనలు ఉన్నాయి. ఆ మేరకు అర్హత గల విద్యార్థులను గుర్తిస్తున్నాం. ఇప్పటికే ఎంఈఓలు, సీఆర్‌టీసీలతో సమావేశం నిర్వహించి ఆదేశాలు ఇచ్చాం. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా తొలుత సీఆర్టీసీలు పాఠశాలల వారిగా పిల్లలను గుర్తిస్తారు. అక్కడి నుంచి ఆ పాఠశాల హెచ్ఎం లాగిన్‌కు పంపుతారు. అనంతరం ఎంఈఓల లాగిన్‌కు పంపి.. వారు పరిశీలించాక ఎస్ఎస్ఏకు విద్యార్థుల వివరాలు పంపుతారు. ఇక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదిస్తాం. తర్వాత రవాణాభత్యం డబ్బులు మంజూరవుతాయి.

- శైలజ, ఏపీసీ, సమగ్రశిక్ష

హత్యల కలకలం..

వేర్వేరు చోట్ల ఇద్దరి హత్య


దాదాపీర్ (ఫైల్)


సన్నక్క(ఫైల్)

హిందూపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఒకేరోజు రెండు హత్యలు కలకలం రేపాయి. పట్టణంలోని గుడ్డం ప్రాంతానికి పాత నేరస్తుడు దాదాపీర్ (35)ను ఆదివారం గుర్తు తెలియని దుండుగులు ఆటోలో తీసుకెళ్లి పట్టణ సమీపంలోని లేపాక్షి మండల పరిధి తిలక్ నగర్ వద్ద కత్తులతో పొడిచి హతమార్చారు. అటుగా వెళ్లేవారు గమనించి లేపాక్షి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హత్యాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. దాదాపీర్‌పై పది కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. గుడ్డం ప్రాంతానికి చెందిన వారి వద్ద రూ.10 వేలు అప్పు తీసుకుని, తిరిగి చెల్లించనందుకు గొడవపడి అప్పిచ్చినవారే హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దాదాపీర్ మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని, విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

పరిగిలో మహిళ..

శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధి బిందు నగర్‌లో సన్నక్క (45)ను శనివారం రాత్రి కర్రతో కొట్టి హత్య చేశారు. పరిగి ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన సన్నక్కను సోమందేపల్లి మండలం చంద్రకచెర్ల వాసి అంజప్పకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సన్నక్క 11 ఏళ్లుగా భర్తకు దూరంగా బిందునగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉండేది. హిందూపురం మండలం చౌళూరుకి చెందిన బోయ నవీన్‌తో సహజీవనం చేస్తుండేది. ఈమె తూముకుంట చెక్‌పోస్టులోని ఒక గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తుండేది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఆమె ఇంటి సమీపంలోనే కర్రతో కొట్టి హత్య చేశారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు.. ఆమె భర్త అంజప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఒకరిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిసింది.

ఆదర్శం.. అనంత అర్బన్‌బ్యాంకు

ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు, నెట్టెం

పేదల బ్యాంకుగా సేవలందిస్తాం: జేఎల్

ఘనంగా 109వ మహాజనసభ


జ్యోతి వెలిగిస్తున్న చైర్మన్లు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): దివాలా తీసే పరిస్థితి నుంచి రూ.900కోట్ల టర్నోవర్‌తో అర్బన్ బ్యాంకుగా రూపాంతరం చెందే స్థాయికి తీసుకువచ్చిన అనంతపురం అర్బన్‌బ్యాంకు.. బ్యాంకింగ్ రంగానికే ఆదర్శంగా నిలుస్తోందని ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుభాష్‌రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 109వ మహాజనసభ చైర్మన్ జేఎల్ మురళీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కేశవరెడ్డి, వెంకటేశు జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించి మాట్లాడుతూ...అర్బన్ బ్యాంకు కార్యకలాపాలు బ్యాంకర్లకు ఆదర్శంగా నిలుస్తున్నాయని.. చైర్మన్ జేఎల్ మురళీధర్ కృషి అభినందనీయం అన్నారు. జాతీయ బ్యాంకులతో పోటీ పడుతూ అగ్రస్థానంలో నిలపడం శుభపరిణామమన్నారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ మాట్లాడుతూ.. అనంతపురం పేద ప్రజల ఆర్థిక పురోగతికి అండగా నిలవడమే తమ బ్యాంకు ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. సామాన్యులకు మరిన్ని సేవలు చేరువ చేయడానికి సమష్టి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, అర్బన్ బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, వైస్‌చైర్మన్లు వడ్డే సుబ్రమణ్యం, చంద్రశేఖర్, డైరెక్టర్లు సుంకర రమేష్, కృష్ణకుమార్, రమణయ్య, గోల్డ్‌బాషా, రొళ్ల బాస్కర్, రామాంజనేయులు, అనిల్‌నాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 5వతేదీ నుంచి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అండర్-22 విభాగంలో బాల, బాలికలకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 5న కబడ్డీ, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్ పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో ఉంటాయని తెలిపారు. ఈనెల 6న వాలీబాల్, అథ్లెటిక్స్ ఖో-ఖో, ఆర్చరీ పోటీలు నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో జరుగుతాయన్నారు. అదే రోజు హాకీ పోటీలు ఆర్ట్స్ కాలేజీలో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు: 9849421462, 08554-353223లను సంప్రదించాలని తెలిపారు.

నిబద్ధత గల విమర్శకుడు ఆనందరావు

ఆలోకనమ్ పుస్తకావిష్కరణ సభలో వక్తలు


ఆలోకనమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నిబద్ధత కలిగిన సాహితీ విమర్శకుడు డాక్టర్ కల్లూరి ఆనందరావు అని పలువురు వక్తలు కొనియాడారు. విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, కళా జ్యోత్స్న సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో డాక్టర్ కల్లూరి ఆనందరావు రచించిన 'ఆలోకనమ్' పుస్తకావిష్కరణ సభను నిర్వహించారు. డాక్టర్ శాంతినారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విమర్శకు రాయలసీమ ప్రధాన భూమిక పోషించిందన్నారు. డాక్టర్ కల్లూరి ఆనందరావు రచించిన ఆలోకనమ్ విమర్శ గ్రంథంలో దళిత బహుజన సాహిత్య విమర్శ చాలా లోతుగా కనిపిస్తుందని కొనియాడారు. సీపీ బ్రౌన్, వేమన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావడమే కాకుండా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని పేర్కొన్నారు. శాంతినారాయణ మాట్లాడుతూ... విమర్శలో తనదైన దృక్పథంతో ప్రయాణిస్తున్న గొప్ప విమర్శకుడు కల్లూరి ఆనందరావు అని, దళిత జీవితం ప్రధానంగా ఆలోకనం విమర్శ గ్రంథంలో కనిపిస్తుందన్నారు. అనంతరం డాక్టర్ కల్లూరి ఆనందరావు, డాక్టర్ నందిరాజు కళ్యాణి దంపతులు అతిథులను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్త తూముచర్ల రాజారామ్, ఉప్పరపాటి వెంకటేశులు, రంగనాయకులు, డాక్టర్ నానీల నాగేంద్ర, కల్లూరి యశస్వి, అంకె శ్రీనివాసులు, యోగేశ్వరనాయుడు, జూటూరు షరీఫ్, టీవీ రెడ్డి, చెట్ల ఈరన్న, ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా పోటీలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి

ఉరవకొండ,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఉత్సాహంగా సాగాయి. యోగాసన స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 240 మంది దాకా పాల్గొన్నారు. పలువురి యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పరిశీలకుడు బద్రీనాథ్, ఆయూర్ సంస్థ ప్రతినిధులు వెంకట్, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆన్-కాల్-డ్రైవర్‌గా పనిచేయడానికి అర్హులైన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని డిపోమేనేజర్ ఇనయతుల్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. 45 సంవత్సరాలలోపు ఉండి, హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన 18 నెలల పైన బస్సు నడిపిన అనుభవం ఉన్నవారు అర్హులని అన్నారు. ఆర్టీఓ కార్యాలయం నుంచి క్లియరెన్స్ పొందిన ధ్రువపత్రం అందచేయాలని, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని డిపోలో హాజరుకావాలని అన్నారు. మెడికల్ చెకప్ అనంతరం అర్హులను విధుల్లోకి తీసుకుంటామని వివరించారు. ఎంపికయిన డ్రైవర్లకు రోజువారి వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

మడకశిర రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి.అచ్చంపల్లికి చెందిన మహిళ రాధమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది. ఆదివారం బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బంధువు ఇంటిలో శనివారం రాత్రి జరిగిన శుభ కార్యక్రమం ముగించుకుని ఇంటిలోకి వచ్చి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తన మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరుగులు తీసినట్లు తెలిపారు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

వాహనం కిందపడి చిన్నారి మృతి

యాడికి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బొలెరో వాహనం వెళ్లడంతో పద్మజ (2) అనే చిన్నారి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని లక్షుంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్షుంపల్లికి చెందిన శేఖర్, రమాదేవి దంపతులు వ్యవసాయం ద్వారా జీవనం పొందుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, రెండేళ్ల కుమార్తె పద్మజ ఉన్నారు. ఆదివారం వారి సొంత వ్యవసాయ పొలంలో టమోట పంట దిగుబడిని బొలెరో వాహనంలో తీసుకొని మార్కెట్‌కు వెళుతున్న సమయంలో ఇంటివద్దకు వెళ్లారు. తిరిగి టమోటాల విక్రయానికి ప్యాపిలికి బయలుదేరే సమయంలో చిన్నారి పద్మజ బొలెరో కింద ఉండడాన్ని గమనించకుండా డ్రైవర్ వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారిని చికిత్స నిమిత్తం రాయలచెరువుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పద్మజ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే..


పరిటాల సునీతకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కడుతున్న స్నేహితురాలు

రామగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత తన చిన్ననాటి స్నేహితురాలు సుగుణమ్మతో కలిసి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో ఎమ్మెల్యే చేతికి స్నేహితురాలు సుగుణమ్మ ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టారు. అదేవిధంగా ఎమ్మెల్యే కూడా ఆమెకు ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టారు. తర్వాత చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

అశాస్త్రీయ ప్రచారాన్ని నమ్మొద్దు: జేవీవీ


మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్

అనంతపురం టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయమైన ప్రచారాన్ని నమ్మవద్దని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జేవీవీ 18వ నగర మహాసభను నిర్వహించారు. జేవీవీ నగర గౌరవాధ్యక్షుడు గాంగే నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గేయానంద్ మాట్లాడుతూ.. సైన్స్ సమాజంలోని అశాస్త్రీయ ప్రచారాన్ని నమ్మదని, అలాంటి వాటితో విభేదిస్తుందని పేర్కొన్నారు. జేవీవీలో పనిచేయడం అంటే మన ఆలోచనలో సరైన మార్పు రావడమే అన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ... సైన్స్‌ను ఆచరించినపుడే దాని ఫలితం కనిపిస్తుందని తెలిపారు. ప్రపంచంలో ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా సైన్స్‌ను సరైన పద్ధతిలో ఉపయోగించడం తప్ప మరో మార్గం లేదన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సైన్స్ ఒక అడుగు ముందుకేస్తే దాన్ని వ్యతిరేకించేవాళ్లు మాత్రం నాలుగు అడుగులు ముందుకు వేస్తారని, దాన్ని తట్టుకుని నిలబడగలగాలంటే పటిష్ఠంగా పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా కార్యదర్శి కెంచా లక్ష్మీనారాయణ, కోశాధికారి మహమ్మద్ జిలాన్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, సమత జిల్లా కన్వీనర్ డాక్టర్ ప్రసూన, నాయకులు పాల్గొన్నారు.

వినయ్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం



అనంతపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరానికి చెందిన ఎన్‌వీ వినయ్ కుమార్‌కు తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ గౌరీమనోహర్ పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థి ఎన్.వీ. వినయ్ కుమార్ తన పరిశోధన పూర్తి చేశారు. మీటిగేషన్ ఆఫ్ పవర్ క్వాలిటీ ఇష్యూస్ ఇన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ విత్ మల్టీలెవెల్ ఇన్వర్టర్ ఫర్ హార్మోనిక్ రిడక్షన్ యూజింగ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. ఈ మేరకు శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం వినయ్ కుమార్‌కి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజమాణిక్యం ప్రకటించారు. వినయ్ కుమార్ అనంతపురం నగరంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో టెన్త్, నలంద జూనియర్ కాలేజీలో ఇంటర్, ఇంటెల్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్, చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంటెక్ చదివారు.

'పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష విభాగం ద్వారా విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వర్క్ ఆర్ట్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి కోరారు. ఆదివారం రెవెన్యూ భవన్‌లో ఇన్‌స్ట్రక్టర్స్ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ.. ఇన్‌స్ట్రక్టర్లు కనీస వేతనానికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గదిలో సహపాఠ్యాంశాలైన చిత్రకళ, పని విద్య, వ్యాయామ ఆరోగ్య విద్యలను పెంపొందించడంలో ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. 13 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో రిటైర్డ్ అవుతున్న వారికి కనీసం ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పోరాడి తెచ్చుకున్న జీఓ 73ని ఇంకా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్, శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శులు వన్నూరుస్వామి, వలి, నాయకులు దివాకర్‌రావు, పీఎస్ ఖాన్, సురేఖరావు, శ్రీదేవి, పద్మపాలెం ప్రభాకర్, విజయకుమారి, సౌజన్య, రాజేంద్ర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

అనంతపురంరూరల్,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేషనల్ పార్కులోగల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. శిల్పారామం ఆధ్వర్యంలో శక్తిశారీ బ్యాగ్స్ సహకారంతో ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ, దుర్గా డ్యాన్స్ అకాడమీ వారిచేత శాస్త్రీయ నృత్యప్రదర్శనలు నిర్వహించారు. నగరంతోపాటు శిల్పారామం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున వచ్చి ప్రదర్శనలు తిలకించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, కళాకారులు లాస్యశ్రీ, సంజన, వైష్ణవి, అమృత, షణ్ముఖప్రియ, అనుప్రియ, రేఖ, హరిణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలు

శింగనమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక రామస్వామి ఆలయంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఎమ్మెల్యే పేరిట ప్రత్యేక పూజలు అర్చనలు చేయించారు. అనంతరం నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. అలాగే స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు బెడ్షు పంపిణీ చేశారు. అనంతరం అనంతపురంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయానికి తరలివెళ్లి అక్కడ కేక్‌కట్ చేశారు. పెరవలి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు గోరంట్ల మారుతీనాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు, నాయకులు కేక్‌కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సౌత్‌కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ కుమ్మెత చంద్రాయుడు, శింగనమల చెరువు ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పట్రా ఎర్రిస్వామి, నాయకులు మెటసాని చలమయ్యయాదవ్, కాయల అనిల్‌యాదవ్, కాయల రమణ్యాయాదవ్, మారుతీనాయుడు, ఎం.ఆదినారాయణ, బండి పరశురాం, గుత్తా ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, మాసూలచంద్ర, రహింతుల్లా, దాసరిగంగాధర్, బోయ సురేష్, కాయల సురేష్, కాయల మహేష్, రాయల్ సత్తి, సర్పంచ్‌లు రాజు, రమేష్ పాల్గొన్నారు.


శింగనమలలో కేక్ కట్ చేస్తున్న దండు శ్రీనివాసులు తదితరులు


బుడ్డన్న జిన్నా వెనుక ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు


బీసీ హాస్టల్ ముందు..

కంపు కొడుతున్న వీధులు

- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

ఆత్మకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ అయిన ఆత్మకూరులోని పలు వీధుల్లో మురుగునీరు రోడ్లపై పారుతుండడం వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఆ కంపు వల్ల స్థానికులు అవస్థలు పడుతున్నారు. దోమలు కూడా వ్యాప్తి చెందుతుండడంతో పలువురు రోగాలకు గురవు తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా భైరవస్వామి వీధి, పడమటి పాతగేరి, ఈశ్వర దేవాలయ ప్రధాన వీధి, కొత్త, పాత ఎస్సీ కాలనీలు, బుడ్డన్న జిన్నా తదితర ప్రాంతాల డ్రైనేజీ కాలువల్లోని మురుగునీరు ప్రధాన డ్రైనేజీ కాలువలోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో ఆ డ్రైనేజీల్లోని మురుగునీరు ముందుకు వెళ్లలేక రోడ్లపైకి వచ్చి పారుతున్నాయి.

ఇక బీసీ హాస్టల్ ముందు పైపులైన్ లీకేజీతో నిత్యం మురుగునీరు పారుతుంటుంది. దీనికి తోడు చుట్టూ పేడ దిబ్బలు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే దుర్గంధంతో హాస్టల్లోని విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పీ.యాలేరు రోడ్డు నుంచి బీసీ హాస్టల్ వరకు పైపు లీకేజీ అవుతుండడంతో రోడ్డంతా బురదమయంగా ఉంటోంది. ఈ ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు దోమలు సైతం విజృంభిస్తుండడంతో రోగాలకు సైతం గురవుతున్నారు.రోడ్లలో మురుగు నీటి వల్ల చిత్తడిగా ఉంటుండంతో రాకపోకలు సాగించడానికి కూడా ఇబ్బందిగా ఉంటోంది. ఇక వర్షాలు వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు, పాలకులకు విన్నవించామని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బాలికల సంక్షేమ హాస్టల్‌లో సందడి

- బిడ్డలతో ఆనందంగా గడిపిన తల్లిదండ్రులు


కూతురితో బర్త్‌డే కేక్ కట్ చేయిస్తున్న తల్లి



బిడ్డలతో ఆనందంగా గడుపుతున్న తల్లిదండ్రులు

ఆంధ్రజ్యోతి విజిట్

అనంతపురం విద్య, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బిడ్డలపై తల్లిదండ్రుల ప్రేమ వెలకట్టలేనిది. ఎన్ని కష్టాలు ఉన్నా దిగమింగుకుని తమ పిల్లలకు ప్రేమను పంచుతూ ఉన్నంతసేపు ఆనందంగా గడుపుతారు. ఇందుకు జిల్లా కేంద్రంలోని గిల్డ్‌ఆఫ్‌సర్వీస్‌స్కూల్ సమీపంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను ఆంధ్రజ్యోతి ఆదివారం విజిట్ చేసినప్పుడు కనిపించిన దృశ్యాలు అద్దం పడుతున్నాయి. ఈ హాస్టల్లో వందలాదిమంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన బాలికలు చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు నగరంలో ఉన్న పాఠశాలలో అయితే మంచిగా చదువుకొని ఏదో ఒక ఉద్యోగం సాధిస్తారనే ఆశతో ఇక్కడ చేర్పిస్తున్నారు. అలా అని పిల్లలను హాస్టల్లో వదిలేసి చేతులు దులుపుకోలేదు. తమ పిల్లలు అక్కడ ఎలా ఉన్నారో, ఎలా చదువుకుంటున్నారోనని చూసేందుకు ప్రతి ఆదివారం వస్తున్నారు ఈ క్రమంలో ఈ ఆదివారం పెద్దఎత్తున తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వచ్చి తమ పిల్లలతో కొన్నిగంటల పాటు ఆనందంగా గడిపారు. బాగోగులు తెలుసుకుని సరదాగా ముచ్చట్లు పెట్టారు. ఇళ్లనుంచి ప్రత్యేక వంటలు చేసుకొచ్చి బిడ్డలకు తినిపించారు. కొందరైతే బర్త్‌డే ఉన్న పిల్లల చేత కేక్‌ను కట్ చేయించారు. పిల్లలు కూడా తమ తల్లిదండ్రులను చూడగానే ఎక్కడలేని సంతోషం వ్యక్తం చేశారు. ఎన్ని సమస్యలున్నా ప్రతి ఆదివారం హాస్టల్లోని తమ బిడ్డల వద్దకు వచ్చి కొద్దిసేపు గడపడం తమకు ఎంతో ఆనందంగా ఉంటుందని పలువురు తల్లిదండ్రులు పేర్కొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి

- గ్రామాలకు నీటి పంపింగ్ ప్రారంభం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి క్రాస్‌లో గల ఆర్డీటీ స్టేడియం వద తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్, నేషనల్ హైవే, పోలీసు శాఖ, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది రెండురోజుల పాటు శ్రమించి పనులను పూర్తి చేశారు. చియ్యేడు, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, చిన్నకుంట, కృష్ణంరెడ్డిపల్లి గ్రామాలకు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అయితే గత మూడు నెలలుగా ఆయా గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయింది. ఆర్డీటీ స్టేడియం వద్ద తాగునీటి పైప్‌లైన్ దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ఆయా గ్రామస్థులు సమస్యను ఎమ్మె ల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్ర మంలో గతరెండు రోజులుగా పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టిన అధికారులు ఆదివారం మధ్యాహ్నానికి పూర్తి చేసి నీరు పంపింగ్ కూడా ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత సాయంత్రం స్వయంగా అక్కడికి వెళ్లి పైప్‌లైన్‌ను పరిశీలించారు. అన్ని గ్రామాలకు నీరు సక్రమంగా సరఫరా అవుతోందా లేదా అని అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, పంచాయితీ కార్యదర్శి అశోక్‌బాబు, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి షెక్షావలినాయుడు, చియ్యేడు సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ రాగే మురళి, నాయకులు పాల్గొన్నారు.

'ఉమ్మడి జిల్లాలో రగ్బీ అభివృద్ధికి కృషి'


శిక్షణకు హాజరైన క్రీడాకారులతో కోచ్‌లు తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఒలంపిక్ క్రీడల్లో చేర్చిన రగ్బీ క్రీడను ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి చేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దుతామని ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడపల శంకర్ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా స్థానిక కస్తూరి ఫిజియోథెరపీ కళాశాలలో జరుగుతున్న రగ్బీ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా రామాంజనేయులు, కడపల శంకర్ మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా క్రీ డాకారులు శిక్షణలో నేర్చుకున్న మెలకువలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రగ్బీ క్రీడాభివృద్ధికి, క్రీడాకారులకు తన వంతుగా సహకారం అందిస్తామని తెలిపా రు. నిపుణులు రగ్బీ క్రీడపై వివరించారు. కార్యక్రమంలో రగ్బీక్రీడా సంఘం ప్రతినిధులు సుమంత్, దత్తారావు, నాగ శ్రీనివాసులు, రాఘవేంద్ర, క్రీడాకారులు, కోచ్‌లు, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణకే జనసేవాదళం: సీపీఐ


జనసేవాదళం సభ్యులతో కలిసి మాట్లాడుతున్న సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్

అనంతపురం విద్య, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల రక్షణ కోసమే జనసేవాదళం ఏర్పాటైందని సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. నగర పరిధిలోని నేషనల్‌పార్క్ సమీపంలో ఆదివారం సీపీఐ శ్రేణులు జనసేవాదళం సభ్యులతో కలిసి కర్రసాము విన్యాసాలు చేశారు. మహిళలు సైతం కర్రలు తిప్పుతూ పాటలు పాడటం ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా జాఫర్ పాల్గొని ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం జనసేవాదళం సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజలకోసం పని చేయాలనే తపనతో తయారయ్యే యోధులే జనసేవాదళం సభ్యులన్నారు. నాడు కామ్రేడ్ చంద్రరాజేశ్వరరావు స్థాపించిన జనసేవాదళం నేడుప్రజాసమస్యలపై ప్రశ్నించే ఒకశక్తివంతమైన వేదికగా మారిందన్నారు. ఈనెల 12, 13వ తేదీల్లో జిల్లాలో నిర్వహించే సీపీఐ జిల్లామహాసభలలో ఎర్రదళం సభ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, జనసేవాదళం శిక్షణ సభ్యులు ప్రసాద్, జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్, సీపీఐనాయకులు లింగమయ్య, పద్మావతి, రమణ, కుళ్లాయిస్వామి, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం: మేయర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. నగర పరిధిలోని 50వ డివిజన్‌లో ఆదివారం ఆయన వైసీపీ శ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ ...మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, అలాగే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ప్రచారం చేశారు. కార్పొరేటర్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: నాగులగుడ్డం, గురుగుంట్ల, వెస్టు నరసాపురం, చిన్నజలాపురం గ్రామల్లో వైసీపీ నాయకులు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ పూల ప్రసాద్, నాయకులు శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గార్లదిన్నె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు, తలగాసిపల్లి జంక్షన్ల వద్ద ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి వాటి రికార్డులను పరిశీలించారు. అనంతరం డ్రైవర్లతో మాట్లాడుతూ వాహనాలు నడిపేసమయంలో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. అప్రమత్తతో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి డ్రైవర్‌కు లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో ధర్మవరానికి చెందిన స్పందన ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో వైద్యులు 234 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు బషీర్, సోనియా, మేనేజర్ బాబాఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.2.72 లక్షలు

అనంతపురంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ.2,72,600 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,58,300, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,14,300 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

గంపమల్లయ్యకు ప్రత్యేక పూజలు

శింగనమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో కొండ మీద వెలసిన గంపమల్లయ్య స్వామికి శ్రావణమాస రెండో ఆదివారం సందర్భంగా భక్తులుప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. కొండపైకి పెద్దఎత్తున తరలివెళ్లి స్వామికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం ఈ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 374 మంది క్రీడాకారులు హాజరవడంతో తీవ్ర పోటీ నెలకొంది. కేటగిరి వారీగా ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్, మిడిల్ ఆర్డర్ బ్యాటర్, వికెట్‌కీపర్, స్పిన్నర్స్ మీడియంపేసర్స్, ఫీల్డర్‌లను వేర్వేరుగా ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఫిట్‌నెస్, ఇతర అర్హతలను పరీక్షించి ప్రాబబుల్స్ ఎంపిక చేస్తామని, అనంతరం ప్రతిభ ఆధారంగా తుది జట్టును ప్రకటిస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. జిల్లా క్రికెట్ సంఘం సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి షబ్బీర్‌అహ్మద్, మాజీ రంజీ ప్లేయర్ షాబుద్దీన్, కోచ్‌లు, సీనియర్ ప్లేయర్లు పాల్గొన్నారు.

అలరించిన మ్యూజికల్ నైట్


జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఆర్‌ఓ తదితరులు

అనంతపురం టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) :అనంత్ నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం సాయంత్రం స్థానిక లలితకళా పరిషత్‌లో నిర్వహించిన సూపర్‌స్టార్ కృష్ణ మ్యూజికల్ నైట్ శ్రోతలను అలరించింది. డీఆర్‌ఓ మలోల, పరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాజుల పద్మజ ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ... సంగీతం అంటే తనకు ఎంతో మక్కువ అని, అనంతపురానికి చెందిన గాయకులు మ్యూ జికల్ నైట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం డీఆర్‌ఓ పాటు గాయనీగాయకులు నాటి మధురగీతాలతో సంగీత ప్రియుల ను ఓలలాడించారు. ముఖ్యంగా సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లో పలు పాటలు పాడి అలరించారు. వీఆర్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

44 శాతం రిజర్వేషన్ల సాధనకు ఉద్యమిస్తాం

- బహుజన ప్రజాప్రతినిధులు


ఐక్యత చాటుతున్న బహుజన నాయకులు,ప్రజాప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో 44శాతం రిజర్వేషన్ల సాధనకు ఉద్యమం చేస్తామని బహుజన నేతలు తెలిపారు. స్థానిక లలితకళా పరిషత్‌లో ఆదివారం రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బహుజనుల ప్రజాప్రతినిధులకు సన్మాన సభ జరిగింది. ఇందులో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఎమ్మెల్సీ పోతుల సురేష్, 93 బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ గణేష్‌బాబు, కర్ణాటక కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు అక్బర్‌బాషా, కర్ణాటక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎస్, ఆర్‌ఈఎఫ్ వ్యవస్థాపకులు నాగరాజు మాట్లాడుతూ... జనాభా దామాషా ప్రకారం బీసీలకు అన్ని రంగాల్లో వాటా కోసం కృషి చేయాలని తెలిపారు. పార్లమెంట్‌లో 44శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్ర కేబినెట్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కలిసికట్టుగా బీసీలకు 44శాతం రిజర్వేషన్లకు పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం బహుజన ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్, నాటక అకాడమీ మాజీ చైర్‌పర్సన్ చామలూరు హరిత, ఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మోహన్, ఆర్‌ఈఎఫ్ జాతీయ కన్వీనర్ నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు రాజా రమేష్, బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా చంద్ర మోహన్, ఆర్‌పీఎస్, ఆర్‌ఈఎఫ్, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మట్టి ఎరువును ఇక్కడ వేయకండి..

- ఎస్ఎస్ ట్యాంకు వద్ద అడ్డుకున్న స్థానికులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డులో జరుగుతున్న బయోమైనింగ్‌లో చెత్త నుంచి వేరు చేసిన మట్టి ఎరువును స్థానిక ఎస్ఎస్ ట్యాంకు వద్ద నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ఎస్ఎస్ ట్యాంకు సమీపంలో మట్టిఎరువును వేయరాదని స్థానికులు ఆదివారం అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా డంపింగ్ యార్డుతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నామని... తిరిగి అదే సమస్యను సృష్టించడం సబబు కాదంటూ చెత్త తరలింపు వాహనాలను అడ్డుకున్నారు. ఇక్కడ నివాసాలతో పాటు పాఠశాలలు ఉన్నాయని, మట్టిఎరువు వల్ల వచ్చే దుర్గంధంతో వ్యాధులువచ్చే ప్రమాదముందని వాపోయారు. కలెక్టర్, కమిషనర్‌ను కలిసి సమస్యను విన్నవిస్తామని తెలిపారు.

అన్నదాత సుఖీభవ అమలుపై సంబరాలు


చిత్రపటాలకు నవధాన్యాలతో అభిషేకం చేస్తున్న నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం అమలుపై టీడీపీ శ్రేణులు ఆదివారం సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కురుగుంటలోని రైతుసేవా కేంద్ర ఎదుట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు నవధాన్యాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో రాప్తాడు తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణ స్వామి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి షెక్షావలి నాయుడు, మండల మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, తెలుగు రైతు మండల అధ్యక్షుడు జయప్రకాష్, చిన్నంపల్లి మాజీ సర్పంచు కొండయ్య, రాప్తాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ బుల్లెట్ రఫీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోకి ప్రవేశ నిషేధం దుర్మార్గం: ఏఐఎస్ఎఫ్



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి విద్యార్థిసంఘాలతో పాటు ఇతరులకు ప్రవేశం లేదంటూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. నిషేధ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వారు ఆ ఉత్తర్వులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో జరిగే దారుణాలు, సమస్యలు బయటపడకుండా ఉండేందుకే ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వెంటనే ఉత్తర్వులు రద్దు చేయాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నాయకులు మంజునాథ్, నాని, సమీర్, తరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీలకు న్యాయం'

అనంతపురం రూరల్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీకి చెందిన వాల్మీకులు పేర్కొన్నారు. మండలంలోని చియ్యేడు సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణను ఆదివారం వారు ఆ గ్రామానికి వెళ్లి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. టీడీపీ అన్ని వర్గాలకు న్యాయం చేస్తోందన్నారు. నామినెటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకుడు పేరంహరి, కొడిమి బూత్ కన్వీనర్ సాకే బ్రహ్మ, నాయకులు బోయనాగరాజు, తాటిచెర్ల శంకర్, ఇటుకలపల్లి రాజేంద్ర, ఉప్పరపల్లి ముత్యాలు, నరేష్, మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ బాలకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ సమస్యపై రైతుల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు

బెళుగుప్ప, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అధిక లోడ్ వల్ల పొలాల్లోని తమ మోటార్లు కాలిపోతున్నాయని మండలంలోని రైతులు గంగవరం సబ్ స్టేషన్ వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. శీర్పి, గంగవరం, కోణాపురం రైతులు మాట్లాడుతూ... ఈ సబ్‌స్టేషన్ నుంచి కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి, ఆత్మకూరు మండలం సిద్దలాంపురం గ్రామాల తోటలకు విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. అధిక లోడుతో వ్యవసాయ మోటర్లన్నీ కాలిపోవడంతో నీరు అందక పంటలు ఎండుతున్నాయని అన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. దీనిపై సబ్‌స్టేషన్ లైన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వీరశైవులను ఓబీసీలో చేర్చాలి


సమావేశంలో పాల్గొన్న శ్రీశైల ఆలయ పండితులు

కణేకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వీరశైవులను ఓబీసీలోకి చేర్చేందుకు తమతో పాటు పండితులు, గురువులు కృషి చేయాలని ఆర్య వైశ్య జాతీయ ప్రధాన కార్యదర్శి వేలూరు మరియప్ప కోరారు. ఆదివారం శ్రీశైల మఠగురువు కుమార పండితారధ్య స్వామితో పాటు పలువురు గురువులతో స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరశైవులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉన్నారని, వారిని ఓబీసీ జాబితాలోకి చేర్చితే అన్ని రకాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివానంద, మాల్యం శరభనగౌడ్, మహేష్, నాగరాజు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రార్థనలు


విరాట పర్వాన్ని పఠిస్తున్న గ్రామస్థులు

బెళుగుప్ప, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపల్లిలో తాతయ్య స్వామి ఆలయంలో మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు, ప్రార్థలు చేస్తున్నారు. ఏటా వర్షం కోసం ఇలా పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం ఆలయంలో శ్రీ మద్విరాట్ పర్వ పఠనం చేసినట్లు తెలిపారు. సోమవారం అన్నసంతర్పణతో ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు.

ఆ జీఓను రద్దు చేయాలి

గుంతకల్లు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లోని అక్రమాలను ప్రశ్నించే విద్యార్థి సంఘాలకు వ్యతిరేకంగా ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ పట్టణాధ్యక్షుడు రోహిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. విద్యార్థి సంఘాలను అణచివేయాలని, కార్పొరేట్ పాఠశాలల ప్రయోజనాలను కాపాడాలన్న లక్ష్యంతో ఈ జీఓను తెచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హాన్, నాయకులు శంకరప్ప, ప్రవీణ్, రంజిత్ నాయక్, వంశీ, మల్లికార్జున, ప్రవీణ్ నాయక్, రియాజ్, అంజి, అనిల్, మోహన్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

తాడిపత్రి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక విజయనగర్‌కాలనీలోని పద్మవాణి హైస్కూల్‌లో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో 473మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సభ్యులు రమేష్‌నాథ్‌రెడ్డి, నారాయణస్వామి, నాగేశ్వర్ రెడ్డి, రాజానాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, వాణి, హైమావతి, రాజేశ్వరి, అనురాధ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా బోరుబావుల తవ్వకాలు


బొమ్మనహాళ్ మండలంలో వేస్తున్న బోరు

బొమ్మనహాళ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎటువంటి అనుమతులూ లేకుండా విచ్చలవిడిగా బోరుబావులను తవ్వేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల వాల్టా చట్టం నీరుగారుతోంది. ఎవరైనా బోరు బావి తవ్వుకోవాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. సర్వే నెంబరు ఆధారంగా రెవెన్యూ సిబ్బంది బోరు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తారు. తర్వాత దరఖాస్తును భూగర్భ జల వనరులశాఖకు పంపుతారు. టెక్నికల్ అధికారి సర్వే చేసి ఆ ప్రాంతంలో నీరు పడుతాయని ధ్రువీకరిస్తే బోరు వేసుకోవడానికి అనుమతిస్తారు. ఒక వేళ బావిలో నీరు పడకపోతే ఆ బావిని పూర్తిగా పూడ్చివేయాలి. ఇంత పకడ్బందీగా వాల్టా చట్టం ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై తహసీల్దార్ మునివేలును వివరణ కోరగా.. అనుమతి లేకుండా బోర్లు వేయడం, చెట్లు కొట్టేయడం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బోరు వేసుకునే వారు ముందుగా రెవెన్యూశాఖ దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిగ్గుబోరువెల్ యాజమాన్యం కూడా అనుమతి లేకుండా తవ్వకాలు జరిపితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు

బ్రహ్మసముద్రం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో అసాంఘిక కార్యకలాపాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గ్రామంలో దొంగతనాలు విపరీతంగా పెరిగాయి. విచ్చలవిడిగా పేకాట ఆడుతున్నారు. మద్యం మత్తులో గొడవ పడుతున్నారు. అయినా వాటిని కట్టడి చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ పట్టుబడ్డ వారి నుంచి ముడుపులు తీసుకుని పోలీసులు వదిలేస్తున్నారని, దీంతో వారు ఆగడాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోందని వాపోతున్నారు. అంతేకాకుండా వరుస దొంగతనాలనూ కట్టడి చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. ఎరడికెర గ్రామంలో ప్రసాద్ నిర్వహిస్తున్న కిరాణా షాపు వరుసగా రెండు సార్లు దొంగతనాలు జరిగాయి. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా వీటిని అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సన్నబియ్యం భోజనం సూపర్ ..!

పథకంపై విద్యార్థుల సంతృప్తి



శ్రీధరఘట్ట హైస్కూల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో పలు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా విద్యార్థులకు సన్న బియ్యంతో కమ్మటి భోజనం అందిస్తోంది. అంతేకాక త్వరలో పెంచిన మెనూ చార్జీలు అమలులోకి తీసుకురానుంది. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఒక్కొరికి రూ. 5.88 ఇస్తుండగా.. ఆ మొత్తాన్ని రూ. 6.19లకు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇస్తున్న రూ. 8.57లను రూ. 9.29లకు పెంచింది. గతంలో దొడ్డు బియ్యంతో భోజనం తయారుచేసి వడ్డిస్తుండడంతో పిల్లలు సరిగా తినేవారు కాదు. చాలామంది ఆర్థాకలితో అలమటించేవారు. మరికొందరు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనం చేసేవారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇంటినుంచే మధ్యాహ్న భోజనం తెచ్చుకునే వారు. ప్రస్తుత ప్రభుత్వం మెనూ ప్రకారం సన్నబియ్యంతో కమ్మటి భోజనం పెడుతోంది. గతం కంటే సన్న బియ్యంతో వండిన భోజనం రుచికరంగా ఉందని సంతృప్తిని విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు పాఠశాలలో సన్న బియ్యంతో భోజనాన్ని రుచికరంగా తయారు చేస్తున్నారని, దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ సంఖ్య తగ్గుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. మెనూ ప్రకారం సన్న బియ్యంతో వండిన అన్నం, ఆకుకూరతో పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి విద్యార్థులకు ఏజెన్సీ వారు వడ్డిస్తున్నారన్నారు.

కడుపునిండా తింటున్నాం



మా స్కూల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనం చాలా రుచిగా ఉంటోంది. సన్న బియ్యం కావడంతో అన్నం మెత్తగా.. పొడిపొడిగా బాగుంది. కడుపు నిండా తృప్తిగా తింటున్నాం. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారు. కూరలు కూడా రుచికరంగా ఉన్నాయి. కడుపునిండా తింటున్నాం.

-ప్రతాప్, 7వ తరగతి, శ్రీధరఘట్ట

విద్యార్థులు తృప్తిగా భోజనం చేస్తున్నారు



విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తృప్తిగా తింటున్నారు. భోజనం, పప్పు, కూరలు బాగుంటున్నాయని విద్యార్థులే అంటున్నారు. ఏజెన్సీ వారు కూడా బాగా వండుతున్నారు. ముందుగా మేం పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు వండిస్తున్నారు. 387 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి రోజు కనీసం 370 మందికిపైగా తింటున్నారు. విద్యార్థులు ఎవరూ ఇంటి నుంచి భోజనాన్ని తెచ్చుకోవడం లేదు.

-కౌసల్య, హెచ్ఎం, శ్రీధరఘట్ట హైస్కూల్

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం


బొల్లు శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

పామిడి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పీ కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్ చైర్మన్‌గా బొల్లు శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. చైర్మన్‌గా బొల్లు శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లుగా వడ్డే పద్మావతి, నల్లఖాదర్ బాషా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వంకరాజుకాలువలో రైతు చిన్న చౌడప్ప రోడ్డు ప్రమాదంలోమృతిచెందడంతో మంజూరైన రూ. రెండు లక్షల ప్రమాదబీమా చెక్కును మృతుడి భార్య సరోజమ్మకు అందజేశారు. సహకార బ్యాంకు తరపున రైతుల ఆర్థికాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తానని చైర్మన్ బొల్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభిషేక మహోత్సవం


స్వాములను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతపేటలో నాగుల పురదయ్య స్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని రాజగిరి గోత్రం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగ పూజ, నల్లకంబడి పూజలు చేశారు. సాయంత్రం మహాసామ్రాజ్య పట్టాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గొరవయ్యల పాలు తాగుట కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలుమత కుల గురువులు, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ హంస శ్రీనివాస్, టీడీపీ నాయకులు ప్యారంకేశవానంద, గోపాల్ పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం


ఆహార పొట్లాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఉరవకొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక విఠల్ రుక్మిణీ అనాథ ఆశ్రమంలోని 30 మందికి ఆదివారం అన్నదానం చేశారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లోని అనాథలకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హరినాథ్, రఘు, నూర్‌మహ్మద్, రమేష్, గోపి, లక్ష్మన్న పాల్గొన్నారు.

కసాపురంలో హోమం

గుంతకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శ్రావణ నవమి తిథిని పురస్కరించుకుని ఉదయం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆయుష్య హోమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల చిత్రపటాలను ఉంచి వేద పండితుడు రామకృష్ణావధాని ఆధ్వర్యంలో ఈ హోమాన్ని నిర్వహించారు.


బీటీపీ కాలువ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

బీటీపీ పనుల పరిశీలన

బ్రహ్మసముద్రం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొబ్బర్లపల్లి సమీపంలో జరుగుతున్న బీటీపీ కాలువ పనులను టీడీపీ మండల నాయకులు ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, బీటీపీ కాలువ పనులు కూడా జోరందుకున్నాయని అన్నారు. ఈ అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, వారు విమర్శలు చేసే ముందు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్లు పాలబండ్ల శ్రీరాములు, ధనుంజయ, సింగిల్ విండో అధ్యక్షుడు ఓబుళేష్, సర్పంచు వనిత మల్లికార్జున, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ వన్నూరు స్వామి, శివయాదవ్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే ప్రజాసమస్యల పరిష్కారం


మహాసభలో మాట్లాడుతున్న జాఫర్

తాడిపత్రి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కమ్యూనిస్టులతోనే సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. స్థానిక రజక ఫంక్షన్‌హాలులో ఆదివారం నిర్వహించిన 16వ నియోజకవర్గస్థాయి మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల అమలులో కూటమి నాయకులు పూర్తిగా విఫలమయ్యారని, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని అన్నారు. పేదలకు ఇస్తామన్న ఇళ్లస్థలాల ఊసే లేదన్నారు. మొదట నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, ఇన్‌చార్జ్ రాజారెడ్డి, పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, మండల కార్యదర్శి నాగరంగయ్య, రైతు సంఘం నాయకులు వీటీ రామాంజనేయులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై ఫొటోలపై గీతలు



శిలాఫలకంలోని ఫొటోలపై గీతలు గీసిన దృశ్యం

పామిడి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులపల్లిలో సీసీ రోడ్డు పనులను జనవరి 30న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఉన్న పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ఫొటోలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ చర్యపై కూటమి నాయకులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

గడేకల్లు పీడీ ప్రతిభ


పీడీ అయూబ్‌ఖాన్

విడపనకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బళ్లారిలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సిటీ రన్ పేరుతో ఆదివారం నిర్వహించిన ఐదు కిలోమీటర్ల పరుగు పోటీలో మండలంలోని గడేకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ అయూబ్‌ఖాన్ మూడో బహుమతి సాధించారు. బళ్లారి స్టీల్ సిటీ అధికారులు ఆయనకు మెమెంటో, సర్టిఫికెట్‌ను అందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

విడపనకల్లు పీహెచ్‌సీ వైద్యురాలు పుష్ప



ఇంటర్వ్యూ

విడపనకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విడపనకల్లు పీహెచ్‌సీ వైద్యురాలు పుష్ప సూచించారు. వాటి బారిన పడకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆదివారం ఆమెతో ఆంధ్రజ్యోతి చేసిన ఇంటర్వ్యూ ఇలా సాగింది.

ప్రశ్న: ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులేంటి?

జవాబు: వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలు అధికంగా వస్తాయి.

ప్రశ్న: దోమల వల్ల వచ్చే వ్యాధులు ఏవి ?

జవాబు: దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర జ్వరాలు వస్తాయి. వీటిని నివారించేందుకు నీటి తొట్టేల్లో ఎక్కువకాలం నీరు నిలువ ఉండకుండా చూడాలి. దోమతెరలు వాడాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వ్యక్తిగత, పరిశరాల పరిశుభ్రత పాటిస్తే సాధ్యమైనంతవరకూ వ్యాధులను దూరం చేయవచ్చు.

ప్రశ్న: జ్వరం వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

జవాబు: మొదట ప్యారాసెట్‌మోల్ ట్యాబ్‌లెట్ వేసుకోవాలి. జ్వరం రెండు రోజులకు కూడా తగ్గకపోతే వైద్యుల వద్దకు వెళ్లాలి. ఫీవర్ ప్రొఫైల్ చేయించాలి. ఇందులో మలేరియా, టైఫాయిడ్‌కు పరీక్షలు చేస్తారు. మూత్ర, రక్త పరీక్షలు, డెంగ్యూ, ఎన్ఎస్ఐఏజీ పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలి.

ప్రశ్న: టైఫాయిడ్ ఎలా వస్తుంది ?

జవాబు: ఇది సల్మోనెల్లా అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవటం ద్వారా... శుభ్రత పాటించకపోవటం ద్వారా ఇది వస్తుంది. దీని నివారణకు యాంటిబయోటిక్ మందులు వేసుకుంటే ఈ జ్వరం తగ్గుముఖం పడుతుంది.

ఎమ్మెల్యే అమిలినేని ఆర్థిక సాయం


వైద్యులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త మనోహర్ భార్య గంగకు ఇటీవల బైక్ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమైంది. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి చికిత్స పొందుతున్న ఆమెకు మేజర్ సర్జరీ చేయాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ఆ ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణసాయం కింద రూ. లక్షను ఆసుపత్రి వైద్యులకు అందచేశారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎల్ఓసీ తీసుకువస్తామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. దీంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం


మాట్లాడుతున్న జీబీసీ అధ్యక్షుడు మారయ్య

విడపనకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జీబీసీ చివరి ఆయకట్టు భూముల వరకూ సాగు నీరు అందిస్తామని ఆ కాలువ అధ్యక్షుడు మారయ్య, మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పయ్యావుల కేశవ్ ఈ కాలువ మరమ్మతులకు దాదాపు రూ. 1.60 కోట్లు మంజూరు చేయించారన్నారు. దీంతో సాగు నీటికి చివరి ఆయకట్టు వరకూ అందిస్తామన్నారు. ప్రస్తుతం కాలువకు 200 క్యూసెక్కుల నీరు వస్తోందని, మూడు రోజుల్లో దాన్ని 350 క్యూసెక్కులకు అధికారులు పెంచుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు తిప్పారెడ్డి, జనార్ధననాయుడు, సీతారాముడు, ఎం శ్రీనివాసులు, డొనేకల్లు శీనప్ప, మేకల భీమన్న, చక్రవర్తి, నూతేటా రామక్రిష్ణ, పరమేషప్ప, కుమారు స్వామి పాల్గొన్నారు.

జీబీసీకి నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న అధికారులు, చైర్మన్

ఉరవకొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు సమీపంలో హెచ్చెల్సీకి అనుబంధంగా ఉన్న గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు అధికారులు ఆదివారం నీటిని విడుదల చేశారు. కాలువకు 250 క్యూసెక్కులు నీటిని వదిలినట్లు డీఈ మంజునాథ్ తెలిపారు. హెచ్చెల్సీలో వచ్చే నీటి సామర్థ్యాన్ని బట్టి కాలువకు నీటిని పెంచుతూ పోతామన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు బ్రాంచి కెనాల్ సాగు నీటి సంఘం చైర్మన్ కాలువ మారయ్య, టీడీపీ నాయకులు గడేకల్లు శ్రీన, సీతారాముడు, కుమార్‌స్వామి, నూతేటి రామకృష్ణ, తిప్పారెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

డీ.హీరేహాళ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం పర్యటించారు. రచ్చకట్ట వద్ద సమావేశం నిర్వహించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

వైన్ షాపులో చోరీ

గుత్తి ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లో పత్తికొండ రోడ్డులోని భవాని వైన్ షాపులో ఆదివారం తెల్లారుజామున చోరీ జరిగింది. ఆ షాపునకు వెనుక భాగంలో రంధ్రం వేసి లోపలికి చొరబడిన దుండగులు రూ. 50 వేలు నగదు, విలువైన మద్యం బాటిళ్లను ఆపహరించారు. ఈ చోరీ దృశ్యాలు సీసీ టీవీలో రికార్డు అయ్యాయి. ఆ షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

వజ్రకరూరు (ఉరవకొండ), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరులో కేవీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన విద్యార్థులు.. ఆదివారం సమావేశమయ్యా రు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.


సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చంద్రబాబు.. ఎన్టీఆర్ విధానాలను అనుసరించాలి



మాట్లాడుతున్న సీపీఐ జగదీశ్

గుంతకల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్డీయేను కాకుండా ఎన్టీఆర్ విధానాలను అనుసరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ జగదీశ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ ప్రజా వ్యతిరేక పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లపై విరుచుకుపడ్డ టీడీపీ నేతలు, ప్రభుత్వం ఏర్పాటు చేశాక స్మార్ట్ మీటర్లకు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. విద్యార్థి సంఘాల సమావేశాలకు పార్టీల ప్రాతినిధ్యం ఉండకూడదంటూ అప్రజాస్వామికంగా ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసిందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు బీ గోవిందు, వీరభద్రస్వామి, బీ మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో దినసరి వేతనం ప్రాతిపదికన డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్‌కార్డుతో పాటు తాడిపత్రి రవాణాశాఖ అధికారి నుంచి లైసెన్స్ క్లియరెన్స్ ధ్రువపత్రం పొందాలన్నారు. అనంతరం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందని, సర్టిఫికెట్ల ఆధారంగా డ్రైవింగ్ పరీక్షకు పంపుతామని, ఉత్తీర్ణులైన వారిని నియమిస్తామని తెలిపారు.